ఫ్రీ జర్నీ సరే.. బస్సుల పెంపేది?



మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణం

- సర్వీసులు లేని రూట్లలో మహిళలకు అందని పథకం
- మహబూబాబాద్ డిపోలో 68, తొర్రూరు డిపోలో 94 బస్సులు
- సంఖ్య పెంచాలని సర్కార్‌కు ప్రయాణికుల విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి పకడ్బందీగా అమలు చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొద్ది రోజులకే మొట్ట మొదటగా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 9 డిసెంబరు, 2023న రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. దీంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల్లో పరిమితికి మించి కిక్కిరిసి ప్రయాణం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.పండుగలు, విద్యా సంస్థలకు సెలవులు వచ్చిన సమయంలో బస్సుల్లో రద్దీ మరింత పెరుగుతోంది. మరో పక్క జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆ ప్రాంత మహిళలకు ఉచిత బస్సు పథకం అందడం లేదు. జిల్లాలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తొర్రూరు, మానుకోట ఆర్టీసీ డిపోల్లో మరిన్ని బస్సులను పెంచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానుకోట డిపో నుంచి..

మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో మొత్తంగా 68 ఆర్టీసీ బస్సులున్నాయి. జిల్లా కేంద్రం నుంచి నర్సంపేట, వరంగల్, ఖమ్మం, సూర్యపేట, తొర్రూరు, మరిపెడ, ఇల్లెందు, హైదరాబాద్ ప్రాంతాలతో పాటు జిల్లాలోని వివిధ రూట్లలో బస్సులను నడిపిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుకు ముందు ప్రతి రోజు 23వేల మంది ప్రయాణికులు డిపో బస్సుల ద్వారా రాకపోకలు సాగించడంతో డిపోకు రూ.9లక్షల ఆదాయం సమకూరేది. పథకం అమలు తర్వాత ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రతిరోజు సుమారు 38వేల మంది ప్రయాణిస్తుండగా తద్వారా రూ.15లక్షల ఆదాయం వస్తుంది. అయితే బస్సులు మాత్రం అవే ఉండగా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల్లో కిక్కిరుస్తూ ప్రయాణిస్తున్నారు. ఇటీవల కాలంలో మానుకోట ఆర్టీసీ డిపోకు రెండు ఎక్స్‌ప్రెస్‌లు, రెండు పల్లె వెలుగు బస్సులు వచ్చాయి.

తొర్రూరు డిపో నుంచి ఇలా...

జిల్లాలోని తొర్రూరు డిపోలో 94 బస్సుల ద్వారా వివిధ రూట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. అక్కడి నుంచి రైలు సౌకర్యం లేకపోవడంతో మానుకోట నుంచి (మిగతా 8వ పేజీలో)





మహబూబాబాద్ ఆర్టీసీ డిపో (ఫైల్)

అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు పంపాం



రోజు రోజుకు ఆర్టీసీ బస్సుల్లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మానుకోట డిపోకు అదనపు బస్సులు కావాలని అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇటీవల మానుకోట డిపోకు రెండు ఎక్స్‌ప్రెస్, రెండు పల్లె వెలుగు బస్సులు వచ్చాయి. వాటిని వివిధ రూట్లలో నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బస్సులను నడిపిస్తున్నాం.

- ఎం.శివప్రసాద్, మానుకోట ఆర్టీసీ డిపో మేనేజర్



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 189 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు సమస్యలపై దరఖాస్తులను అందజేస్తారని, నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కారం చూపి గ్రీవెన్స్‌పై మరింత నమ్మకాన్ని పెంచాలని సూచించారు. శాఖల వారీగా గ్రీవెన్స్ దరఖాస్తులు ఏమైనా పెండింగ్ ఉంటే దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. కాగా, గ్రీవెన్స్‌కు దరఖాస్తుదారులు పోటెత్తడంతో ఉదయం 10.30 గంటలకు ఆరంభమైన గ్రీవెన్స్ సెల్ మధ్యాహ్నం 1.45 గంటల వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో 189 దరఖాస్తులు రావడంతో దాదాపు 3 గంటలకు పైగా అధికారులు వాటిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లా అధికారులు మధుసూదనరాజు, అశోక్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, నర్సింహాస్వామి, శ్రీనివాసరావు, సురేష్, శ్రీనివాస్, యాదగిరి, కృష్ణవేణి, శిరీష, రజిత, దేశీరాం, హరిప్రసాద్, మరియన్న, శంకర్, సురేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజా పాలనతోనే అభివృద్ధి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ద్వారానే నిరంతర అభివృద్ధి జరుగుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఇటీవల విదేశీ పర్యటనను ముగించుకుని నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన నేపథ్యంలో సోమవారం తొర్రూరు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కార్యకర్తలు అన్ని విధాలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో కొత్తగా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందుతున్నాయని, రేషన్ కార్డుల ద్వారా ఆరోగ్యశ్రీ, ఇతర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య, సురేందర్‌రెడ్డి, పంజ కల్పన, సోమ రాజశేఖర్, సుంచు సంతోష్, చిదిరాల రవి, రాంచంద్రయ్య, దొంగరి శంకర్, విజయ్‌పాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

- పార్టీని మోసం చేస్తే వదిలిపెట్టేది లేదు..
- ఆ రూ.300 కోట్లు ఉత్తివే.. పనులు ప్రారంభం కావు
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. కేసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కేసముద్రంలో ముగ్గురు పెద్ద నాయకులు పార్టీతో లబ్ధి పొంది, పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ఖబడ్దార్.. ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారిని మళ్లీ తీసుకోబోమని తెలిపారు. పదేళ్ల పాటు కార్యకర్తలను కాపాడుకున్నానని, ఇక్కడికి వచ్చిన వారే నిజమైన కార్యకర్తలని అన్నారు. గ్రామాల్లో నలుగురు కూడిన చోట కాంగ్రెస్ చేసిన మోసంపై చర్చ చేయాలని, రైతులకు బోనస్, రుణమాఫీ అమలు కాని విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ 420 హామీలను ప్రజలు నమ్మి గెలిపించారని, హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేసముద్రం మునిసిపాలిటీ ప్రతిపాదన తాను పెట్టిన దానికే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారని అన్నారు. ఇక్కడ మంజూరైన రూ.300 కోట్ల పనులు ఉత్తివేనని, పనులు ప్రారంభం కావని అన్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క పని చేయలేదని, చెరువుల కట్టలు తెగిపోతే మరమ్మతులు చేసే నాథుడే లేదని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు నీలం దుర్గేష్, మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ. నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, గుగులోత్ వీరునాయక్, ఊకంటి యాకుబ్‌రెడ్డి, మోడెం రవీందర్‌గౌడ్, చిర్ర యాకాంతంగౌడ్, సట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు

- పనిచేస్తున్న చోటే వైద్యులు నివాసం ఉండాలి
- జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్

తొర్రూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, ఆస్పత్రుల నిర్వహణను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని సుప్రీత, నిర్మల, పద్మావతి నర్సింగ్‌హోమ్, గణేష్ డయాగ్నస్టిక్ సెంటర్‌లకు నోటీసులు జారీ చేశారు. ఆస్పత్రి యాజమాన్యాలు అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన వివరాలు, ధరల పట్టిక, పనిచేస్తున్న డాక్టర్ల వివరాలు రోగులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ, శానిటేషన్, సూచికల బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత 6 నెలలుగా పట్టణంలో చోటు చేసుకుంటున్న వరుస సంఘటనలపై ఆరా తీసి వివరాలు తెలుసుకున్నారు.

ఎలాంటి అర్హతలు లేకుండా స్టెరాయిడ్స్, యాంటీ బయాటిక్స్ ఇవ్వడం సరికాదన్నారు. రోగిని క్షుణ్ణంగా పరీక్షించి వైద్యం అందించాలని సూచించారు. అర్హతకు మించి వైద్యం చేస్తే కేసుల నమోదు తప్పవని హెచ్చరించారు. ఇటీవల జరిగిన సంఘటనలో విచారణ అనంతరం దోషులుగా తేలిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. కొందరు ప్రభుత్వ వైద్యులు సొంతంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి ప్రసాద్, సీహెచ్‌వో విద్యాసాగర్, డీపీఎంవో వనాకర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సుప్రీత ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి రాథోడ్

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 15 పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రారంభించబడిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీకి ఎంపికైన 15పాఠశాలల నుంచి ముగ్గురి చొప్పున 45 మంది ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను సోమవారంప్రారంభించారు. ఈసందర్భంగా (మిగతా 8వ పేజీలో)

చోరీ కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్టు

- వాహనాలు, రోటోవేటర్, ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ రవికుమార్

బయ్యారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో మూడు చోరీలకు పాల్పడిన ఆరుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బయ్యారంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవికుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలోని గార్ల మండలం సర్వన్‌తండా చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన గుగులోత్ సాయికిరణ్, బోడా రవి, గుగులోత్ రవితేజ, కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన మాలోత్ ప్రేమ్‌కుమార్, భూక్యా హుస్సేన్, గూడూరు మండలం గడ్డితండా కొల్లాపూర్ గ్రామానికి చెందిన తోట కృష్ణలు బయ్యారం, మహబూబాబాద్ మండలాల్లోని మూడు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. తొలుత బయ్యారం మండలకేంద్రంలోని వేమ నరేష్‌కు చెందిన నర్సరీ వద్ద సుమారు రూ.70వేలు విలువ చేసే సెంట్రింగ్ బాక్సులను అపహరించారు. అనంతరం ఉప్పలపాడు గ్రామపంచాయతీ లక్ష్మీనరసింహాపురం సమీప వైకుంఠధామం చుట్టూ అమర్చిన ఫెన్సింగ్ వైరు(ముళ్లతీగ రూ.30వేలు)ను దొంగిలించారు. నిందితులు సెంట్రింగ్ బాక్సులు, ఫెన్సింగ్ వైరును గూడూరు మండలం గడ్డితండా కొల్లాపూర్ గ్రామానికి చెందిన తోట కృష్ణకు విక్రయించారు. ఈ క్రమంలోనే నిందితులు మహబూబాబాద్ పట్టణంలోని నర్సంపేట బైపాస్ క్రాస్ రోడ్డులో గల ఆగ్రో ఇండస్ట్రీస్ షాపు వద్ద వ్యవసాయ పనిముట్టు రోటోవేటర్(రూ.లక్ష)ను ఎత్తుకెళ్లారు. రోటోవేటర్‌ను విక్రయించేందుకు తీసుకెళ్తున్న క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు అనుమానాస్పదంగా తారస పడినట్లు సీఐ రవికుమార్ పేర్కొన్నారు. పోలీసులను చూసి పారిపోతున్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి టాటాఏస్ ట్రాలీ వాహనం, ట్రాక్టర్, రోటోవేటర్‌తో పాటు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. కాగా, చాకచక్యంగా చోరీలను ఛేదించిన బయ్యారం ఎస్సై తిరుపతితో పాటు సిబ్బంది మోహన్, సారంగపాణి, సురేష్, రమేష్, హరిదాస్, మహేష్‌లను ఈ సందర్భంగా సీఐ రవికుమార్ అభినందించారు.



బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపి చోరీల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రవికుమార్



నల్లబెల్లిలో యూరియా గోదాం వద్ద విచారణ చేస్తున్న అధికారులు

యూరియా నిల్వలు.. రైతుల అవస్థలు

ఫర్టిలైజర్ షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు

నల్లబెల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను, గోదాంలను ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏవో రజిత, ఎస్సై గోవర్ధన్‌లు సోమవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని కర్ర మల్లారెడ్డి ఫర్టిలైజర్ షాపులో రిజిస్టర్‌ను ఏడీఏ పరిశీలించారు. అనంతరం గోదాం వద్దకు వెళ్లి పరిశీలించారు. గోదాంలో 1286 యూరియా బస్తాలను నిల్వ ఉంచినందున ఫర్టిలైజర్ షాపు యజమాని కర్ర కృష్ణరెడ్డిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలియజేశారు. రైతులకు యూరియాను అమ్మకుండా గోదాంల్లో నిల్వ ఉంచే ఫర్టిలైజర్ షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ తెలిపారు. డీలర్లు యూరియాను రైతులకు అమ్మకుండా నిల్వ ఉంచుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి రంగంలోకి దిగి నల్లబెల్లిలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను రైతులకు ఇప్పించాలని రైతులు కోరారు.

మృతికి కారణమైన ఆరుగురిపై కేసు నమోదు

● ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులు

● మిస్టరీని ఛేదించిన పోలీసులు

ఎల్కతుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుతాఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించబోయిన నిందితులు పోలీసుల దర్యాప్తుతో పట్టుబడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గండికోట సాంబరాజు (32), అదే గ్రామానికి చెందిన శీలం బాలరాజు, ఊదరి రాజులు కలిసి శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని వచ్చునూరి ప్రవీణ్ పొలం వైపు పావురాల శికారుకు వెళ్లారు. అప్పటికే అక్కడ అడవి పందుల కోసం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి చందర్‌రావు ప్రోద్బలంతో అదే గ్రామానికి చెందిన పెండ్యాల తిరుపతి, ఎల్కతుర్తికి చెందిన బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు అడవి పందులను సంహరించడానికి వచ్చునూరి ప్రవీణ్ పొలంలో ఉన్న విద్యుత్ పోలు నుంచి తక్కళ్ళపెల్లి నర్సింగారావు చేను వరకు విద్యుత్ సరఫరాతో కూడిన వైర్లను అమర్చారు. అక్కడ అమర్చిన వైర్లను గమనించని సాంబరాజు విద్యుత్ వైర్లకు తగులగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆ సమయంలో వెంట ఉన్న ఉన్న శీలం బాలరాజు, ఊదరి రాజులు విషయాన్ని గమనించి అక్కడినుంచి పారిపోయారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ వైర్లు అమర్చిన పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు నేరం తమపైకి రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న గ్రామ మాజీ సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు వ్యవసాయ బావిలో పడేసి ప్రమాదానికి కారణమైన ఆనవాళ్లను తొలగించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి చేరుకున్నారు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ మృత దేహాన్ని బావిలోంచి బయటకు తీసి శవ పంచనామ నిర్వహించారు.

దీంతో మృతుడి కాలికి విద్యుత్ షాకు తగిలి ఏర్పడిన గాయాన్ని గుర్తించి దర్యాప్తును వేగవంతం చేశారు. మృతికి కారణమైన తక్కళ్ళపెల్లి చందర్‌రావు, పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్, శీలం బాలరాజు, ఊదరి రాజులను గుర్తించి మిస్టరీని ఛేదించారు. అనంతరం మృతురాలి భార్య మమత ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితులు పరారీలో ఉండగా ప్రత్యేక పోలీస్ బృందంచే గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మృతుని బంధువులు నిందితుల ఇంటి వద్ద ఆందోళన చేసే పరిస్థితులు ఉండటంతో గోపాల్‌పూర్ గ్రామంలో సీఐ పులి రమేష్ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైద్య కళాశాలలో నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 19 వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు-9, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-21, సీనియర్ రెసిడెంట్-36, ట్యూటర్స్ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలు

ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు

మహాముత్తారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో ఎంపీడీవో, పీఏసీఎస్ నూతన కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. రూ. కోటి 20లక్షలతో ఎంపీడీవో భవనాన్ని నిర్మించగా, రూ. 73లక్షల 50వేలతో పీఏసీఎస్ భవనాన్ని నిర్మించారు. వీటిని మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో, పీఏసీఎస్ కార్యాలయాలకు అధునాతన సౌకర్యాలతో భవనాలను నిర్మించామని, దీంతో పరిపాలన సౌలభ్యం మెరుగుపడుతుందని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యేలా కృషి చేయాలన్నారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కలెక్టర్ రాహుల్ శర్మ, కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీసీవో వాలియ నాయక్, పీఆర్ ఎస్ఈ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.శ్రీనివాస్, ఎఫ్ఆర్వోలు రాజేశ్వర్, రమేష్, పీఏసీఎస్ సీఈవో శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహాముత్తారం ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో గివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సౌజన్యంతో 650 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పాఠశాలలను బలోపేతం చేసేందుకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రతి నియోజవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, టీచర్ల కొరత లేకుండా నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేస్తున్నారని అన్నారు. మహదేవపూర్ పాఠశాలకు మంచి చరిత్ర కలిగి ఉందని, దీన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.15 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దీనికి ముందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మధు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

● వెంకటేశ్వర్లపల్లిలో ఘటన

చిలుపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బీహార్‌కు చెందిన కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం వెంకటేశ్వర్లపల్లిలో చోటు చేసుకుంది. జనగామ రూరల్ సీఐ (రఘునాథపల్లి) ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. బీహార్ రాష్ట్రంలోని బాగులబడికి చెందిన అర్షద్ ఆలీ(25) వెంకటేశ్వర్లపల్లిలో హైటెన్షన్ విద్యుత్ స్థంభాల నిర్మాణానికి సంబంధించి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వైర్లు లాగడం కోసం సమీపంలో ఉన్న విద్యుత్ పోల్ పైకెక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీ ఎంకు తరలించారు. కాగా, ఆ సమయంలో మల్లికుదుర్ల నుంచి వెంకటేశ్వర్లపల్లికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మృతదేహాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

త్వరలో ముఖ గుర్తింపు హాజరు

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడి

కేయూ క్యాంపస్ జూలై 14, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలోనే ముఖగుర్తింపు హాజరును తెస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లతో కలిసి కాన్వకేషన్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి పలు కీలక అంశాలను వెల్లడించారు. వచ్చే నెలలో ఉద్యోగులందరికీ ముఖగుర్తింపు హాజరు అమలు చేస్తామని, హ్యాక్‌థాన్ నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపస్‌లో వైఫై సౌకర్యాలను మరింత సమర్థవంతంగా వచ్చేలా చేస్తామని, మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. యూజీ కోర్సుల్లోనూ ఆన్‌స్క్రీన్ కంప్యూటరైజ్డ్ మూల్యాంకనం చేపడుతామని అన్నారు. క్యాంపస్‌లోని 14 సెమినార్ హాళ్లను అధునీకరిస్తామని ప్రకటించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రోగ్రాంను సక్సెస్ చేసుకుందామని చెప్పారు. కెహబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుందామని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ చానల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెబ్‌సైట్ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్లు ప్రొఫెసర్‌గాదె సమ్మయ్య, హన్మంతు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

ములుగు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఐదుగురు మావోయిస్టులు ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట సోమవారం లొంగిపోయారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన ఏరియా కమిటీ సభ్యుడు శ్యామల రాజేష్ అలియాస్ ఐత (22), అదే ఏరియాకు చెందిన సభ్యులు కడ్తిల్‌దుమా (20), బీజాపూర్ జిల్లాకు చెందిన ఊకె జోగి (18), బాడిషె భీమా (21), ముచాకి జోగి (16) ఉన్నారని వివరించారు. ములుగు జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన 'పోరుకన్నా.. ఊరుమిన్న', 'మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాలు నచ్చి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

వివిధ కేడర్లలో పనిచేసిన 73 మంది మావోయిస్టులు ఏడు నెలల కాలంలో పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. అధినాయకత్వ తీరు నచ్చక కిందిస్థాయి కేడర్ అజ్ఞాత వాసాన్ని వీడవి శాంతియుత జీవితం గడపడానికి లొంగిపోతున్నారని తెలిపారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించకపోవడంతో ఆహార పానీయాలు అందక కేడర్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లలేనంతగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. 90శాతానికి పైగా కేడర్ నిరుపేద ఆదివాసీలన్నారు. కుటుంబాల అభివృద్ధి కోసం చాలా మంది పార్టీని వీడుతున్నారన్నారు. ఇది శుభ పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి పట్ల నిబద్ధతను కలిగి ఉందని తెలిపారు. సోమవారం లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టులకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున రూ. 1.25 లక్షలు అందించామన్నారు. వారి పేరుపై ఉన్న రివార్డులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

● నానమ్మ మెడలో నుంచి బంగారు నగ చోరీ చేసిన మనవళ్లు

● నిందితుల్లో ఒక బాలుడు

● ఆభరణం రికవరీ, బైక్ స్వాధీనం

జఫర్‌గడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నానమ్మ మెడలో నుంచి బంగారు ఆభరణాన్ని దొంగిలించిన ఇద్దరిని (ఒకరు మైనర్) పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జఫర్‌గడ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బానోత్ రాంచరణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు ఘటనా వివరాలను వెల్లడించారు. ఓబులాపూర్‌కు చెందిన చీపురు యాకస్వామి బతుకు దెరువు కోసం భార్యా పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా హైద్రాబాద్‌లోని చర్లపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇతడి తల్లి వృద్ధురాలైన సులోచన ఓబులాపూర్‌లోని సొంత ఇంటిలో ఉంటోంది. యాకస్వామి పెద్ద కుమారుడు అఖిల్ జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. తన నానమ్మ మెడలోని బంగారు గోపి తాడుపై కన్నేసి బాలుడైన తమ్ముడిని వెంటపెట్టుకుని ఈనెల 11న తెల్లవారుజామున బైక్‌పై అఖిల్ ఓబులాపూర్‌కు చేరుకున్నాడు.

నిద్రిస్తున్న నానమ్మ సులోచన మెడలో నుంచి 30గ్రాముల గోపి తాడును అన్నదమ్ములు బలవంతంగా తెంపుకుని పారిపోతుండగా వృద్ధురాలు మేల్కొని గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమెను నెట్టివేసి బైక్‌పై పారిపోతూ ఇదే మండలం తమ్మడపల్లి (జి) క్రాస్ వద్ద గల చెట్లపొదల్లో బంగారు నగను దాచి చర్లపల్లికి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో దాచిన బంగారు గోపితాడును సోమవారం నిందితులైన యాకస్వామి, బాలుడు వచ్చి తీసుకుని బైక్‌పై వెళుతుండగా జఫర్‌గడ్ క్రాస్ నల్లబండ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగిలించిన 30 గ్రాముల గోపి తాడును, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అఖిల్‌పై పలు పోలీసు స్టేషన్లలో నాలుగు దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచి నిందితులను చాకచక్యంగా పట్టుకుని ఆభరణాన్ని రికవరీ చేసిన జఫర్‌గడ్ ఎస్ఐ రాంచరణ్‌నాయక్, పోలీసు సిబ్బందిని వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం అభినందించారు.



నిందితుడిని అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాన్ని చూపుతున్న వర్ధన్నపేట పోలీసులు

వాకింగ్ చేస్తుండగా విద్యార్థికి పిట్స్

● గ్రౌండ్‌లో కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలింపు

● చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి

● మృతుడు ఇంటర్ విద్యార్థి

ధర్మసాగర్ , జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తోటి విద్యార్థులందరితో కలిసి మెలసి ఉంటూ వాకింగ్ చేస్తుండగా ఓ విద్యార్థికి పిట్స్ వచ్చి కిందపడిపోయాడు. పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన స్టేషన్‌ఘపూర్ మహాత్మాజ్యోతి బాపూ లే రెసిడెన్సియల్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక విద్యార్థులు తెలిపిన కథనం ప్రకారం. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మహత్మజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ బాలుర సంక్షేమ పాఠశాల, కళాశాలను ఘన్‌పూర్‌లో సరైన వసతులు లేకపోవడంతో గత కొన్నేళ్ల క్రితం ధర్మసాగర్ మండలం కరుణాపురానికి తరలించారు. పదోతరగతి నుంచి ఇంటర్ వరకు 700 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది. సోమవారం ఉదయం 6.45 గంటల సమయంలో పాఠశాలలోని విద్యార్థులందరూ పాఠశాల సమీపంలోని గ్రౌండ్‌లో రోజువారీగా వాకింగ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో శాయంపేట మండలం ప్రగతి సింగరం గ్రామానికి చెందిన బత్తిని కుమారస్వామి విశాల దంపతులు కుమారుడు మణితేజ(17) అనే విద్యార్థి ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్నాడు. రోజువారిగా గ్రౌండ్‌లో వాకింగ్ మొదటి రౌండ్ పూర్తి చేసి, రెండవ రౌండ్ నడుస్తున్న క్రమంలో మణితేజకు ఆకస్మాత్తుగా పిట్స్ వచ్చి కిందపడ్డాడు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులతో పాటు అక్కడే ఉన్న పీఈటీలు ఎం.రాజు, టి.రాజు ఇద్దరు కలిసి మణితేజను తమ ద్విచక్రవాహనంపై కొంత దూరంలో ఉన్న ప్రధాన రోడ్డు మీదికి తీసుకెళ్లారు. వెంటనే 108.కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మణి తేజ మృతి చెందాడు. పాఠశాల నుంచి తల్లి విశాలకు,తండ్రి కుమారస్వామికి మణితేజకు పిట్స్‌వచ్చిందని సమాచారాన్ని అం దించారు. కుటుంబసభ్యులు ఎంజీఎంకు వచ్చి మణితేజను చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో వారి రోదనలు మిన్నంటాయి. సీఐ ప్రవీ ణ్ కుమార్ పాఠశాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





మృతి చెందిన విద్యార్థి మణితేజ, కరుణాపురం జ్యోతిబాపూలే పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

గృహోపకరణాల దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్‌లో సెలెక్ట్ మొబైల్ ఎదురుగా ఉన్న 33కేవీ లైన్ తీగలు ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కావడంతో మూడు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో రూ.2లక్షల దాక ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. మహాలక్ష్మి బేకరి వద్ద ఉన్న 33 కేవీ లైన్ తీగల్ని కాకులు తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఇంటి యజమాని ప్రతాపగిరి సుగుణ వాపోయింది. దీంతో ఇంటిలోని స్మార్ట్ టీవీ, సీసీ కెమెరాలు, ఫ్రిడ్జ్, వైరింగ్, స్విచ్‌లు కాలిపోయాయి. అలాగే బాలాజీ క్లాత్ స్టోర్‌లో సర్వీస్ వైరు, రవళి కంగన్ హాల్‌లో టీవీ కాలిపోయిందని మొత్తంగా రూ.2 లక్షల వరక ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఇదే లైన్‌తో మే 20న కె.కృష్ణకుమారి ఇంటిపై పిడుగు పడి ఇంట్లోని విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి రూ.1.5 లక్షల దాక నష్టం వాటిల్లింది. ఇదే ఇంటిలో 2022లో, 2023లో వర్షాకాలంలో పిడుగు పడి వస్తువులు కాలిపోయాయి. జనావాసాల నడుమ ఉన్న 33కేవీ లైన్‌ను మార్చాలని లేదా బేకరి వద్ద టవర్ వేసారని, ఆ తర్వాత టవర్ వేయక పోవడం వల్ల లైన్ తీగలు కిందకు ఉండడం వల్ల కూడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు మృతి

నివాళులర్పించిన జేఏసీ, వివిధ పార్టీలు, సంఘాల నేతలు



హన్మంతు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణానికి చెందిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు గుంజె హన్మంతు(86) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. తన స్వగృహంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. కాగా, గుంజె హన్మంతు తెలంగాణ రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాలతో పాటు జిల్లా ఏర్పాటు, కుల, సామాజిక, సాంస్కృతిక, ప్రజా ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. స్వరాష్ట్ర ఉద్యమంలో కేసులపాలై జైలు జీవితం కూడా గడిపారు. తన వయసు మళ్లినప్పటికి తుది శ్వాస విడిచేంతవరకు ప్రజా ఉద్యమాల్లో చురుకుగ్గా పాల్గొన్నారు. గుంజె హన్మంతు మృతి వార్త తెలుసుకున్న జేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ, నేతలు ఎమ్డీ.ఫరీద్, పిల్లి సుధాకర్, శంతన్‌రామరాజు, గుగ్గిళ్ల వీరయ్య, కొండ్ర ఎల్లయ్య, సామ పాపయ్య, కమ్మగాని కృష్ణమూర్తి, ఇ.ఉప్పలయ్య, కంబాలపల్లి సత్యనారాయణ, బోడ లక్ష్మణ్, ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి ఉమ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, బి.విజయసారథి, బి.అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, పద్మం ప్రవీన్, హరిసింగ్, మార్నేని రఘు, మామిడాల సత్యనారాయణ, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, నారోజు సత్యమనోరమ, నారాయణసింగ్ తదితరులు పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో హన్మంతు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కాగా, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఫోన్‌లో హన్మంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులు..

మహబూబాబాద్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి సిగ్నల్ కాలనీలోని శ్మశానవాటిక వరకు ఉద్యమకారుడు గుంజె హన్మంతు అంతిమ యాత్ర కొనసాగింది. ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గుంజె హన్మంతు మృతదేహంతో తెలంగాణ ఉద్యమకారులు నివాళులర్పించి మౌనం పాటించారు. కళాకారులు పాటలు పాడి హన్మంతు పోరాట స్మృతులను స్మరించుకున్నారు. అక్కడి నుంచి సిగ్నల్ కాలనీ శ్మశాన వాటిక వద్దకు తీసుకుని వెళ్లి క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ పూర్వ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. గుంజె హన్మంతు అకాల మృతి సామాజిక ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2405	1521
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4350	1575
కందులు	6122	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7500	5300
పసుపు (కాడి)	11920	9534
పసుపు (గోల)	10309	9700
తేజ మిర్చి	9500	8500
తేజ ఏసీ	13000	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం

- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- సిమెంట్, స్టీల్‌ది అదే దారి
- సమస్యగా మారిన కూలీల కొరత
- లబ్ధిదారులపై ఆర్థిక భారం

దేవరుప్పుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందంకంటే, నిర్మాణ భారం పెరుగుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణ సామగ్రి, కూలి రేట్లు పెరగడంతో లబ్ధిదారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోవడం లేదని వాపోతున్నారు. చేసేది లేక కొందరు అప్పు చేస్తుంటే, మరి కొందరు బంగారం తాకట్టు పెడుతున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలతో నివసించేందుకు సరిపడేలా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవచ్చని, అదనపు వసతుల పేరుతో అప్పులపాలు కావద్దని పేర్కొంటున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

సామగ్రి	పాత ధర	కొత్తధర
ట్రాక్టర్ రాయి	రూ.2,000	రూ. 2,500
ట్రాక్టర్ దొడ్డు కంకర	రూ.2,000	రూ.2,500
ట్రాక్టర్ సన్న కంకర	రూ.3,700	రూ.4,500
స్టీల్ కేజీ	రూ.48	రూ. 55
సిమెంట్ బస్తా	రూ.300	రూ. 380
ట్రాక్టర్ ఇసుక	రూ.2,000	రూ. 4,000
ఇటుక ఒకటి	రూ.12	రూ. 14
లేబర్ (రోజుకు)	రూ.600	రూ. 800
తాపీమేస్త్రీ (రోజుకు)	రూ.900	రూ.1,200
బిల్డర్స్ స్క్వేర్ ఫీట్	రూ.1,600	రూ.1,650

పెరిగిన ధరలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైన నాటి నుంచి నిర్మాణ సామగ్రి, తాపీమేస్త్రీ, లేబర్ కూలి ధరలు అమాంతం పెరిగాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది.

పత్తి కలుపు తీయడానికి, ఇతర వ్యవసాయ కూలి పనులకు వెళ్తున్నారు. బీహార్ నుంచి వలస వచ్చిన తాపీమేస్త్రీ, కూలీలు కూడా వర్షాకాలం కావడంతో పాటు అక్కడ ఎన్నికల నేపథ్యంలో కొంత మంది ఇప్పటికే స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఒప్పుకున్న సమయానికి ఇల్లు నిర్మించి ఇచ్చే విషయంలో కూలీల కొరతతో బిల్డర్లు తంటాలు పడుతున్నారు.



సీతారాంపురంలో పిల్లర్ల దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇసుక పాలసీ ఇలా..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అది సాధ్యమవడం లేదు. ఉచిత ఇసుక అనగానే ఇంటికి సరిపడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని లబ్ధిదారులంతా భావించారు. అందుబాటులో ఉన్న వాగుల నుంచి ఇసుకను ఉచితంగా తెచ్చుకునేందుకు ట్రాక్టర్ల కిరాయి ఖర్చులు అధికమవుతున్నాయి. వాగు పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలకు రూ. 2వేలు, మండల పరిధిలోని కొన్ని దూరపు గ్రామాలకు రూ.4వేలు, ఇతర మండలాలలోని గ్రామాలకు రూ. 6వేలు చొప్పున ట్రాక్టర్ ఇసుకను విక్రయిస్తున్నారు. 400ఫీట్ల ఇంటి నిర్మాణానికి 6 ట్రిప్పులు, 500ఫీట్ల ఇంటి నిర్మాణానికి 9ట్రిప్పులు, 600ఫీట్ల ఇంటి నిర్మాణానికి 12ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక రవాణాకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాలు అనుమతులు ఇస్తున్నాయి. దీంతో ఇసుక భారం తప్పడం లేదు.

తప్పని అప్పు

లబ్ధిదారుల్లో మెజారిటీ పేదలే ఉన్నారు. కొద్దిమంది మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. 400-600 ఫీట్లలోపే ఇందిరమ్మ ఇంటిని నిర్మించాలని నిబంధనలు స్పష్టం చేస్తుండగా, ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలకు మరింత జోడిస్తే ఇంకాస్త సౌకర్యంగా నిర్మించుకోవచ్చని ఆశపడుతున్నారు. దీంతో బంగారాన్ని బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో తాకట్టు పెడుతున్నారు. కొందరు అధిక వడ్డీతో అప్పు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలకు అదనంగా రూ.4 లక్షల నుంచి రూ.7లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతోందని తెలుస్తోంది.

అప్పు చేయక తప్పడం లేదు

బస్వ అనసూర్య, లబ్ధిదారు, సీతారాంపురం



ప్రభుత్వం ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయించినా సరిపోవడం లేదు. ఇంకో ఐదారు లక్షల వరకు అప్పు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే అప్పు తెచ్చాం. పాత పెంకుటిల్లుతో చాలా ఇబ్బందులు పడ్డాం. కోతులు పెంకులు పీకడంతో వర్షాకాలంలో ఇళ్లంతా కురిసేది. పెంకుటిళ్ల కూలగొట్టి స్లాబ్ వేసుకుంటున్నాం. కానీ ఖర్చులు పెరుగుతున్నాయి.

నిబంధనల ప్రకారమే ఇల్లు నిర్మించుకోవాలి

సురేష్‌కుమార్, ఎంపీడీవో, దేవరుప్పుల



ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి. 400-420 స్క్వేర్ ఫీట్స్‌లో ఇల్లు పిల్లర్లు లేకుండా కట్టుకుంటే ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోతాయి. అదనపు వసతుల కోసం హంగులు, ఆర్భాటాలకు పోయి 600 స్క్వేర్ ఫీట్స్ వరకు ఇల్లు నిర్మించుకుని రూ.10లక్షల నుంచి రూ.12 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలు కావద్దు. ముగ్గు పోసుకునే ముందు మా కార్యదర్శులకు సమాచారం ఇస్తే రూ. 5లక్షల వ్యయంతో 400స్క్వేర్ ఫీట్స్ వరకు దగ్గరుండి పోయిస్తారు.



నెల్లుట్ల గ్రామ పంచాయతీ

ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి

- ప్రత్యేక అతిథి జాబితాలో రొండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చోటు
- కేంద్రానికి సిఫారసు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

లింగాలఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథులుగా పంపేందుకు పలువురి అధికారుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి నామినేట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాబితాలో జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ప్రతీ ఏటా ఎర్రకోటపై భారత రక్షణ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించడం ఆనవాయితీ. ఈమేరకు 2025 వేడుకల కోసం రాష్ట్రాల నుంచి హాజరుకావాల్సిన ప్రత్యేక అతిథుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. కేంద్ర పథకాలను సంపూర్ణంగా అమలు చేసి అవార్డులను అందుకున్న గ్రామపంచాయతీల ప్రతినిధులను ఎంపిక చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ కేంద్రానికి సిఫారసు చేసింది.

ఈ జాబితాలో 2023 ఏప్రిల్ 6న నీటి సమృద్ధి పథకంలో జాతీయ స్థాయి పురస్కారం నెల్లుట్ల గ్రామపంచాయతీకి దక్కింది. దీంతో అప్పటి సర్పంచ్ చిట్ల స్వరూపారాణిభూపాల్‌రెడ్డి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారితోపాటుగా మరో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను నామినేట్ చేస్తూ కేంద్రానికి పంపింది. జాబితాలో నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి చోటు దక్కడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం సిఫారసు చేసినట్లుగా నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శిని ప్రత్యేక అతిథిగా గుర్తిస్తూ కేంద్రం తుది నిర్ణయం తీసుకుంటే పంచాయతీకి అరుదైన గౌరవం దక్కినట్లు అవుతుందని జిల్లావాసులు పేర్కొంటున్నారు.



సంపత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

చాకలి ఐలమ్మ ముని మనవడి మృతి

కొద్ది రోజులుగా అనారోగ్యంతో సతమతమవుతున్న సంపత్



సంపత్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనవడు చిట్యాల సంపత్ (45) అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. చాకలి ఐలమ్మ రెండో కుమారుడు పిచ్చయ్యకు భార్య భారతమ్మ, నలుగురు కుమార్తెలుండగా, ఏకైక కుమారుడు సంపత్. పిచ్చయ్య గతంలో చనిపోయాడు. పదేళ్ల క్రితం కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లి ఎలక్ట్రీషియన్‌గా సంపత్ పని చేశాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడేళ్లుగా సంపత్ పాలకుర్తిలోనే ఉంటున్నాడు. సంపత్ భార్య గౌరీశ్వరీ, కుమారుడు ఐటీఐ పూర్తి చేసి ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, కుమార్తె ఎంబీఏ చదువుతుంది. కాగా, సంపత్ సీపీఐ(ఎం)లో పని చేశారు. 1981, 1994 జీపీ ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థిని గెలిపించడంలో కీలకపాత్ర పోషించాడు.

పలువురి నివాళి

సంపత్ మరణవార్త తెలుసుకుని పలువురు సోమవారం ఆయన ఇంటికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదునూరి మదార్, చిట్యాల సమ్మయ్య మృతదేహానికి నివాళులర్పించారు. సోమవారం పాలకుర్తిలో సంపత్ అంత్యక్రియల్లో ప్రజాసంఘాలు, ఐలమ్మ వాసులు పాల్గొన్నారు.

11 ఏళ్ల నిరీక్షణకు తెర

- కొత్త రేషన్ కార్డుల మంజూరు
- జిల్లాలో ఇప్పటి వరకు 2,31,516 కార్డులు
- కొత్త కార్డుల సంఖ్య 14,541



హనుమకొండ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు అందనున్నాయి. ప్రజాపాలనతో పాటు విడిగా మీ-సేవ సెంటర్ల ద్వారా నిరుపేదలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కొత్త సభ్యుల చేర్పుతో పాటు ఇతర మార్పులు, చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు నిరంతరం ఉంటుందని ప్రభుత్వం చెప్పడంతో ఇంకా దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. వీటన్నింటిని రెవెన్యూ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి ధృవీకరిస్తున్నారు. ధృవీకరించిన దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కమిషనర్ కార్యాలయానికి పంపించడం, కార్డులు మంజూరు కావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కార్డులు అందడంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందనున్నాయి.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించడంతో ఇక హనుమకొండ జిల్లాలో కూడా కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కూడా అందనున్నాయి. ఇప్పటికే కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరైన విషయం తెలిసినప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఇక వారికి కార్డులు అందనున్నాయి.

హనుమకొండ జిల్లాలో 2,31,516 కార్డులు

హనుమకొండ జిల్లాలో మొత్తంగా 2,31,516 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇలా ఉండగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల్లో 16,541 కార్డులు మం జూరయ్యాయి. వీరందరికి కూడా రేషన్ కార్డులు అందుతాయి. కార్డు మంజూరును మీ-సేవ లేదా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని అధికారులు చెబు తున్నారు. లబ్ధిదారులకు ఆహార భద్రతా కార్డు స్లిప్ రూపంలోనే రేషన్ కార్డులు అందుతున్నాయి. ఇకపై ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయ నుంది. అయితే జిల్లా అధికారులు మాత్రం ఇంకా ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ఆదేశాలు రాలేదంటున్నారు. జిల్లాలో కొత్త లబ్ధిదారుల ఎంపిక నిరంతరం ఉంటుందంటున్నారు. అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన పూర్తి కాగానే కార్డు మంజూరు అవుతుందంటున్నారు. ఇక కొత్తగా మం జూరైన కార్డుదారులందరికి సెప్టెంబరు నుంచి సన్న బియ్యం అందనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల బియ్యం కోటాను లబ్ధిదారులకు అందచేసింది. ఈ క్రమంలో సెప్టెంబరు నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరుగనుంది.

నెరవేరిన కల

రేషన్ కార్డు కోసం 11 ఏళ్ల కిందటే దరఖాస్తులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్వీకరించింది. కార్డు కోసం కొత్తగా వేల సంఖ్యలో దరఖాస్తులు జిల్లా అధికార గణానికి అందాయి. మార్పులు, చేర్పుల దరఖాస్తులు కూడా సమర్పించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణతోనే సరిపెట్టింది. పదేళ్ల ఆ ప్రభుత్వ హయాంలో కార్డులు కల గానే మిగిలాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలం గడిచిన తరువాత ప్రజాపాలన ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. మీ-సేవ సెంటర్ల ద్వారా దరఖాస్తులు నమోదు అయ్యాయి. ప్రతీ ఒక్కరికి కార్డులు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తోంది. ఈ మేరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంగా 11 ఏళ్ల రేషన్ కార్డు నిరీక్షణకు తెరపడింది.

యూరియా దొరికేనా ?

- పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
- సరిపడా పంపిణీ చేయని అధికారులు
- నానో యూరియాపై అవగాహన కరువు
- పంట దిగుబడులపై ప్రభావం
- ప్రభుత్వంపై రైతాంగం మండిపాటు



నల్లబెల్లి పీఏపీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



చెన్నారావుపేటలో యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు

వరంగల్ వ్యవసాయం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు వేసిన రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పీఏసీఎస్, ప్రైవేటు ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. పుష్కర కాలంగా రైతులు ఏనాడూ యూరియా కొరతను ఎదుర్కోలేదు. కాని ఈసారి ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రానికి కావాల్సినంత యూరియా పంపిణీ చేయాలని కేంద్రాన్ని కోరినా ఉపయోగం కనిపించడం లేదు. ఇదిలా ఉంటే వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖాధికారులు మాత్రం జిల్లాలో సాగుకు సరిపడా యూరియాను ఇప్పటికే పంపిణీ చేయడంతో పాటు అదనంగా 70 వేల బస్తాలను పంపిణీ చేసినట్లు చెబుతుండడం విడ్డూరంగా ఉంది.

రైతులు ఆగ్రహం

సకాలంలో యూరియా వాడకపోతే దాని ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం ఈ దఫా మాత్రం యూరియా కోసం ఎదురు చూడాల్సి వస్తోందని మండి పడుతున్నారు.

నానో యూరియాపై అవగాహన లేమి

పంట సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ద్రవ రూపంలో నానో యూరియాను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల పంటకు త్వరగా నత్రజని అందుతుంది. కిరణజన్య సంయోగక్రియ పెరుగడంతో పాటు అధిక దిగుబడి వస్తుంది. ద్రవ రూపంలో ఉన్న అర లీటర్ నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానంగా పనిచేస్తుంది. యూరియా బస్తాకు రూ.266లు ఉండగా ద్రవ రూపంలో ఉన్న అర లీటరు నానో యూరియా రూ.225లకే మార్కెట్లో దొరుకుతోంది. నానో యూరియా పైపాటుగా పంటసాగుపై స్ప్రే చేయడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది. అయితే వ్యవసాయశాఖ అధికారులు నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఆసక్తి చూపించడం లేదు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది.

ఆందోళన వద్దు..

కె.అనురాధ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి



జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు అవసరానికి మించి అదనంగా 70 వేల యూరియా బస్తాలను పంపిణీ చేశాం. జిల్లాలో ఇప్పటి వరకు పత్తి 1,09,360 ఎకరాలు, వరి 6,500, మొక్కజొన్న 11,500, కందులు 40, పత్తి 40, మినుములు 40, ఎర్ర జీలుగ 10,200 ఎకరాలు సాగైంది. వాటికి సరిపోను యూరియాను ఇప్పటికే పంపిణీ చేశాం. సోషల్ మీడియాలో కథనాలను నమ్మవద్దు. వాస్తవానికి యూరియా కొరత లేదు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

రోజంతా క్యూలో ఉంటే రెండు బస్తాలిచ్చారు..

- కందకట్ల సాంబయ్య, రైతు, చెన్నారావుపేట



రోజంతా లైనులో నిల్చుంటే రెండు యూరియా బస్తాలు ఇచ్చారు. నానో యూరియా కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామన్నారు. నాకు ఉన్న రెండెకరాలకు గతంలో ఎంతో సులువుగా యూరియా దొరికేది. యూరియాను పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలి.

ముందుగానే దిగుమతి చేసుకోవాల్సింది..

- బొందిరెడ్డి ప్రతాపరెడ్డి, రైతు, కన్నారావుపేట



ఖరీఫ్ ప్రారంభం కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావాల్సిన యూరియా దిగుమతి చేసుకోవాల్సింది. యూరియా సకా లంలో అందకపోతే దిగుబడి తగ్గిపోతుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా యూరియా పంపిణీపై దృష్టి పెట్టాల్సింది. ఇప్పటికైనా వెంటనే రైతాంగానికి కావాల్సినంత యూరియాను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

బాధ్యత లేకుండా భట్టి మాట్లాడటం సరికాదు

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి



భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న భట్టి విక్రమార్క బీజేపీ చీఫ్‌పై బాధ్యత లేకుండా మాట్లాడటం సరికాదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, న్యాయవాదిగా, నాయకుడిగా నిరంతరం ప్రజా సేవలో ఉంటున్న రాంచదర్‌రావుపై పాత సంఘటనల పేరుతో బురదజల్లే ప్రయత్నం చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. హెచ్‌సీయూ ఘటనకు రాంచందర్‌రావుకు ఏలాంటి సంబంధం లేదని పోలీసులు, హైకోర్టు స్పష్టం చేయడం జరిగిందన్నారు. రోహిత్ వేముల దళితుడు కాదని బీసీ వర్గానికి చెందిన వాడని కోర్టు తేల్చి చెప్పడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళిత ముసుగులో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. కోర్టు తీర్పులను అంగీకరించలేని నేతలు అధికారంలో ఉండటం ప్రమాదకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుందన్నారు. భట్టి విక్రమార్క వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్నా ప్రభాకర్, ఎస్సీ మోర్చా నాయకుడు నానునాయక్, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఉపాధ్యక్షుడు శ్రీనువాస్, కార్యదర్శులు శివకుమార్, వెంకటేశ్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణ శివారు సాలార్‌తండా సమీపంలో మిషన్ భగీరథ గ్రిడ్ నీటి సరఫరా ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడ్డ కారణంగా ఈ నెల 15న పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు సాలార్‌తండా వద్ద పైపు లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారన్నారు. అవి పూర్తికాగానే పట్టణ ప్రజలకు నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు.

ప్రైవేటు స్కూల్ బస్సును అడ్డుకున్న గ్రామస్థులు

డోర్నకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం గొల్లచర్లలో సోమవారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గ్రామస్థులతో కలిసి ప్రైవేటు పాఠశాల బస్సులను అడ్డుకున్నారు. ప్రైవేటు స్కూళ్లలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. దీంతో స్థానికులతో కలిసి గ్రామానికి ప్రైవేటు స్కూళ్ల బస్సులు రావొద్దని వారు అడ్డుకున్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు 8 నుంచి 10 పని గంటల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గం ఒకవైపు నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తుంటే వాటిని వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలకు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. జీవో 282ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పని గంటల పెంపు ప్రజా పాలనలో భాగమేనని ప్రశ్నించారు. జూలై 31న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, సంపత్, బీకు, శ్రీరాం పుల్లయ్య, వెంకన్న, నవీన్, రవికుమార్, యాకయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి

బయ్యారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కూలీలకు సంబంధించిన పెండింగ్ కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బయ్యారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ నేతలు కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీ నాయకుడు భిక్షం మాట్లాడుతూ కూలీలు పనులు చేసి సుమారు 6 వారాలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. అంతేగాక మొదటి నుంచి పనిచేసిన కూలీలకు డబ్బులు చెల్లించకుండా పనిచేయని వారికి మస్టర్లు వేసి డబ్బులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కూలీ డబ్బుల చెల్లింపుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు వీరభద్రం, రాకేష్, సంగన్న, బుచ్చయ్య, విశ్వనాథం, సుధాకర్, లక్ష్మీనారాయణ, రేణుక, వెంకన్న, విజయ, కాశమ్మ పాల్గొన్నారు. అంతకుముందు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో విజయలక్ష్మికి అందజేశారు.

చిల్డ్రన్స్ హోంలో ఎన్ఆర్ఐ జన్మదిన వేడుకలు



దైవకృప చిల్డ్రన్స్ హోంలో ఎన్ఆర్ఐ ప్రియరాగరెడ్డి జన్మదిన వేడుకలను జరుపుతున్న లయన్స్‌క్లబ్

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని దైవకృపచిల్డ్రన్స్ హోంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఆర్ఐ మర్రి ప్రియరాగరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. సింగపూర్‌లో నివాసముంటున్న లయన్స్ క్లబ్ మానుకోట శాఖ కార్యదర్శి పర్కాల రవీందర్‌రెడ్డి కూతురు ప్రియరాగరెడ్డి కోరిక మేరకు తన జన్మస్థలంలోని అనాథాశ్రమంలో పిల్లల మధ్య ఆమె జన్మదిన వేడుకలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న పిల్లల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎన్ఆర్ఐ ప్రియరాగరెడ్డి తన పుట్టిన రోజును అనాథాశ్రమంలో జరుపుకోవాలని నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పిల్లలతో కలిసి లయన్స్‌క్లబ్ బాధ్యులు భోజనం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌బాధ్యులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, మాలె కాశీనాథ్, సాదుల సురేష్‌బాబు, ఆల్‌టెక్ రమేష్, అనుమాల సిద్ధార్థ, పర్కాల ఉపేందర్‌రెడ్డి, బవిరిశెట్టి శ్రీనివాస్, అనాథాశ్రమ నిర్వాహకులు బానోత్ లోకేష్, జర్నలిస్టులు ఫయాజ్, ఉదయ్‌ధీర్, నగేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని పోరాడిన ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దు ఉద్యమ కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు సోమవారం వామపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వామపక్ష పార్టీల పోరాటాలతోనే ప్రధాని మోదీ దిగివచ్చి రైతు నల్ల చట్టాలను రద్దు చేశారని చెప్పారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు మదార్, సామ పాపయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, పెరుగు కుమార్, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, నవీన్, వెంకన్న, శేఖర్, శ్రావణ్, మేక వీరన్న, మాధవి, పద్మ, ఉపేందర్, రాజమౌళి, రాజు, హేమానాయక్, సాయిలు, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి ఫ్రిజ్, కుర్చీలు అందజేత

డోర్నకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి ఎన్‌కే ఆగ్రోస్ సంస్థ ఆధ్వర్యంలో రిఫ్రిజిరేటర్(ఫ్రిజ్)తో పాటు 10 కుర్చీలు, సామన్లను భద్రపరిచేందుకు ఫర్నిచర్‌ను జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సమాజ సేవ కోసం ఎన్‌కే ఆగ్రోస్ ముందుకు వచ్చి తోడేళ్లగూడెంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో మందులు భద్రపరుచుకునేందుకు ఫ్రిజ్, రోగులు కూర్చునేందుకు కుర్చీలు, సామగ్రి భద్రపరిచేందుకు ఫర్నిచర్‌ను బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు సాద్విజ, ఎన్‌కే ఆగ్రోస్ సంస్థ ప్రతినిధులు శివప్రసాద్, ప్రసాద్, కెవి.రాజు, తాళ్లూరి కృష్ణారావు, సిబ్బంది వెంకన్న, ఎంజల, మంజుల, రాకేష్, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు సరికాదు

- టీడీపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అనంతరెడ్డి

నెహ్రూసెంటర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేయడం సరైంది కాదని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు యానాల అనంతరెడ్డి స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న పద్మశాలి భవన్‌లో నియోజకవర్గంలోని పట్టణ, రూరల్ కమిటీలను పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటికి విరుద్ధంగా ఈ నెల 13న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ.. కమిటీలను నియమించారని చెప్పారు. ఈ పరిణామాలపై రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున బండి పుల్లయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు, ప్రేమ్‌చంద్‌వ్యాస్, హరికిషన్, బొమ్మ వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

మహబూబాబాద్ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని దుకాణాల యజమానులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై సోమవారం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసు అందిన రెండు వారాలలోపు అన్ని షాపుల బయట, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శివ, సూరయ్య, ప్రశాంత్ ఉన్నారు.

ముగ్గురు ఎస్సైల రిపోర్టు..

మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ముగ్గురు ఎస్సైలు రిపోర్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్ కమిషనరేట్‌లో పని చేసిన టి.ప్రశాంత్‌బాబు, టి.అశోక్, బి.మౌనికలు జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఉత్తర్వుల మేరకు టౌన్ ఠాణాలో రిపోర్టు చేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనలను తొలగించాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



మహబూబాబాద్‌లో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఐ నేతలు

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనివార్యమైన నిబంధనలను తొలగించాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు ఇక్కట్లు పడుతున్నారని, వారి సమస్యలను నివృత్తి చేసి ఇళ్లు అందించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు జీవో 58 ద్వారా ఇంటి పట్టాలిస్తామని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అర్జీలు స్వీకరించిందని అన్నారు. ఇందులో మానుకోట పట్టణంలో 10వేల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 1,275 మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపారు. పట్టాలు రాని వారు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సీహెచ్.వెంకన్న, వి.నాగేంద్రబాబు, వద్దిచరణ్, వీరన్న పాల్గొన్నారు.

మొట్లగూడెం పాఠశాలకు డ్రెస్‌కోడ్ ఇవ్వాలి

బయ్యారం మండలం మొట్లగూడెం ప్రభుత్వ పాఠశాలకు డ్రెస్ కోడ్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతం మొట్లగూడెం పాఠశాల 2003 వరకు ఐటీడీఏ పరిధిలో కొనసాగిందని, అనంతరం మండల పరిషత్‌లోకి రావడం జరిగిందని చెప్పారు. అప్పట్లో పిల్లలు లేరనే కారణంతో బడిని మూసివేశారని, ప్రస్తుతం విద్యార్థుల రాకతో మళ్లీ తెరిచారని, డ్రెస్ కోడ్ లేక పోవడంతో విద్యార్థులకు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బానోత్ సాయికుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు కాలేజీకి హాస్టల్ ఏర్పాటు చేయాలి

గూడూరు మండల కేంద్రంలోని కళాశాలకు సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టల్(ఎస్ఎంహెచ్)ను ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బానోత్ దేవేందర్, తిరుపతి, వీరేష్, గణేష్, మోహన్, రాజు పాల్గొన్నారు.

ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు

డోర్నకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ సోమవారం తెలిపారు. డోర్నకల్ మండలం మల్లాయికుంట తండాకు చెందిన అఖిల్, ఉషాల్ అనే యువకులు అదే తండాలోని కిషన్ అనే వ్యక్తిపై ఈ నెల 12న దాడి చేశారు. ఈ దాడిలో కిషన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో అఖిల్, ఉషాల్‌పై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రెడ్యాలలో యువకుడి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మండలం రెడ్యాలలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన ప్రకారం.. రెడ్యాల గ్రామానికి చెందిన అల్లి హుస్సేన్-వెంకటమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిన్నకుమారుడు అల్లి సురేష్(32) మహబూబాబాద్‌లో ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం భార్య రజిత విడాకులు ఇవ్వడంతో నాటి నుంచి దిగాలుగా ఉండేవాడని చెప్పారు. మనస్తాపం చెందిన సురేష్ ఆదివారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందినట్లు చెప్పారు. తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికలు నిర్వహించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

తొర్రూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తొర్రూరు మండల కేంద్రంలో ఉన్న జమా మసీద్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని మసీద్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అమీర్ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు నిబంధన మేరకు ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కానీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి ఎలక్షన్ల కోసం నోటీసులు జారీ చేస్తే ప్రస్తుతం ఉన్న మాజీ కమిటీ సభ్యులు నోటీసులను తొలగిస్తూ వక్ఫ్ బోర్డు అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత అధ్యక్షుడి పదవీ కాలం ముగిసి మూడేళ్లు గడిచినా పదవి నుంచి తప్పుకోకుండా ఎన్నికలు జరపకుండా అడ్డుపడుతున్నాడని, గతంలో ప్రజావాణిలో రెండు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ తమ దరఖాస్తును పరిశీలించి ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో ఆలస్యంగా ఖరీదులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం ఖరీదులకు సోమవారం ఆలస్యం జరిగింది. వ్యాపారులు ఖరీదులు చేసేందుకు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రెండ్రోజుల క్రితం మార్కెట్ అధికారులు మార్కెట్‌లో జరిగిన క్రయవిక్రయాలు, కంపెనీల వద్ద జరిగిన ఖరీదులను, వాటికి సంబంధించిన మార్కెట్ ఫీజు వివరాలు వేర్వేరుగా సమర్పించాలని వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. దాంతో వ్యాపారులు మార్కెట్‌కు ధాన్యం ఖరీదులు చేయడానికి ఉదయం ముందుకు రాలేదు. మధ్యాహ్నం వరకు వేచి చూసినప్పటికి వ్యాపారులు రాకపోవడంతో మార్కెట్ కార్యదర్శి శంషీర్, చైర్మన్ సుధాకర్ వ్యాపారులకు ఫోన్ చేసి మధ్యాహ్నం రప్పించారు. దాంతో మధ్యాహ్నం 2గంటల తర్వాత ధాన్యం కుప్పలను ఖరీదులు చేపట్టారు.

స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

మరిపెడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్య లు ఉంటాయని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్ హెచ్చరించారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ప్రైవేట్ క్లినిక్‌లు, మెడికల్ షాపులను డీఎంహెచ్‌వో, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంద వెంకన్నకు చెంది న క్లినిక్‌ను సీజ్ చేశారు. కేర్ మెడికల్ స్టోర్‌తో పాటు మరో నాలుగు మెడికల్ షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి సరైన పత్రాలు లేక సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రవి రాథోడ్ మాట్లాడుతూ ప్రైవేటు క్లినిక్‌లో స్టెరాయిడ్ ఇంజక్షన్లు, సెలూన్ బాటిల్స్ ప్రమాదకరమైన యాంటీబాటిక్స్ వాడుతున్నారని క్లినిక్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో వెంట కొప్పు ప్రసాద్, కేవీ రాజు తదితరులు ఉన్నారు.

పురాతన శివాలయాన్ని శుభ్రం చేయించిన నాగన్న

కురవి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం రాజోలు గ్రామంలో 700 ఏళ్ల క్రితం కాకతీయులు నిర్మించిన పురాతన శివాలయం ఆదరణకు నోచుకోక అపరిశుభ్రంగా ఉంది. గ్రామానికి చెందిన మేకల నాగన్న సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో శిథిలావస్థలోని ఆలయాన్ని శుభ్రం చేయించారు. అనంతరం శివాలయంలో ప్రతిరోజు పూజలు జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయించారు. పురాతన ఆలయాన్ని శుభ్రం చేయించి మనుగడలోకి తీసుకురావడంతో మేకల నాగన్నను గ్రామస్థులు అభినందించి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ కృషి

పెద్దవంగర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రుతండా, చిన్నవంగర, బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పదోన్నతులు చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికల కంటే ముందే పదోన్నతులు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య, జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్‌యాదవ్, కార్యదర్శి వల్లాల శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తిలో ప్రమాదానికి గురైన వారికి రావాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న అన్నారు. సదరు డిమాండ్‌తో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కేజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.... కల్లుగీత వృత్తి అతి ప్రమాదకరమైనదని, అయినప్పటికి బతుకుదెరువు కోసం గీత కార్మికులు వృత్తిని ఎంచుకుని జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 710 మందికి రూ.12.96 కోట్లు, మానుకోట జిల్లాలో 28 మందికి రూ.32.20 లక్షల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందని చెప్పారు. బడ్జెట్ లేదనే సాకు చూపుతూ ఎక్స్‌గ్రేషియా చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. 14 జూలై, 2024లో లష్కర్‌గూడలో జరిగిన కాటమయ్య రక్షణ కవచం పథకం ప్రారంభ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ఎక్స్ గ్రేషియా విడుదల చేస్తామని ప్రకటించి సంవత్సరం గడుస్తున్నా అతీగతి లేదన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ దీక్షలో సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, ఉపాధ్యక్షుడు గునిగంటి మోహన్, వెంకటేశ్వర్లు, మండ విక్రమ్, వెంకన్న, యాకన్న, రవి, స్వాతి, లింగమ్మ, మల్లయ్య తదితరులు కూర్చున్నారు. కాగా, వివిధ సంఘాల నాయకులు చిత్తనూరి శ్రీనివాస్, జెరిపోతుల వెంకన్న, గుగులోతు కిషన్‌నాయక్, వీరేందర్, కుర్ర మహేష్ సంఘీభావం తెలిపారు.

యూరియాపై అసత్య ప్రచారం మానుకోవాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి



కొత్తగూడలో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగిలి

కొత్తగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : యూరియా నిల్వలపై ప్రతిపక్ష నాయకులు అసత్యప్రచారం మానుకోవాలని, వారి మాటలు నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని, రైతులందరికీ అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేసేందుకు మంత్రి సీతక్క కృషి చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడ, గంగారం మండలాల్లో మొక్కజొన్న పంట అధికంగా సాగు చేస్తారని పేర్కొన్నారు. రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని మంత్రి సీతక్క అధికారులతో చర్చించి గతంలో కంటే మూడు రేట్లు అధికంగా యూరియాను సొసైటీకి దిగుమతి చేశారని పేర్కొన్నారు. కానీ, కొంతమంది ప్రతిపక్ష నాయకులు యూరియా నిల్వలపై అసత్య ప్రచారం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని, మంత్రి సీతక్కను అబాసుపాలు చేసేందుకు ప్రతిపక్ష నాయకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేసేందుకు మంత్రి సీతక్క కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్ర జనార్దన్‌రెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలత, మండల అధికార ప్రతినిధి ఇర్స రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపు రంజిత్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చొప్పరి కుమార్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నామోజు కృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బోడ ఈర్యానాయక్, నాయకులు గుమ్మడి సమ్మయ్య, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, రాజం సాంబయ్య పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గార్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గార్ల సీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్‌జాదవ్ అన్నారు. మండలంలోని పెద్దకృష్ణాపురం, గండితండాల్లో ముల్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో పారిశుధ్య పనులపై ప్రజలు దృష్టి పెట్టాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు అదుపు చేయవచ్చన్నారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, సిబ్బందిపాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధుల విడుదలకు సహకరించాలి

గార్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారిన పాకాల ఏటిపై రాంపురం సమీపంలో వంతెన నిర్మాణానికి నిధుల విడుదలకు సహకరించాని కోరుతూ సోమవారం సీపీఐ ప్రతినిధి బృందం డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా వర్షాకాలంలో చెక్‌డ్యాం పొంగి అనేక మంది కొట్టుకుపోయి మరణించారని వారు వివరించారు. వంతెన నిర్మాణం చేపడితే ఈ ప్రాంతంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గార్ల వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాస్, సారిక శ్రీనివాస్, గుగులోత్ వెంకటేశ్, బాల పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టులు, బెల్టులు పంపిణీ

ఇనుగుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో భూక్య ప్రభాకర్ రూ.10వేల విలువైన టీషర్టులు, టై, బెల్టులు, బ్యాడ్జీలు, షూలను సమకూర్చగా నెల్లికుదురు ఎస్ఐ సీహెచ్.రమేష్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్య, రాజశేఖర్, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

- ఇనుగుర్తి రాముతండా ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ గుగులోత్ నవీన్ సమకూర్చిన రూ.10వేల విలువైన టీషర్టులను ఎంఈవో రూపారాణి విద్యార్థులకు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రాంనర్సయ్య, ధనలక్ష్మి, కార్యదర్శి రాజు, మధుబాబు, సత్యలత, రామన్న, సంతోష్, మీటునాయక్, సీతారాం, కోక్యానాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

డీఈవో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వైజ్ఞానిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు రూ.10లక్షల అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంపికైన ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సర్కార్ కల్పిస్తున్న వసతులను ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, డీఎస్‌వో అప్పారావు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, ట్రైనింగ్ నిర్వాహకులు శంషాద్ పాల్గొన్నారు.

పరికిపండ్ల అశోక్‌కు మహాత్మా చరఖా అవార్డు



డాక్టర్ అశోక్‌ను మహాత్మా చరఖా అవార్డుతో సన్మానిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ పరికిపండ్ల అశోక్ గత 20 సంవత్సరాలుగా గాంధీజీ ఆలోచనలు, ఆశయాలపై గాంధీజీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా చరఖా అవార్డుతో సన్మానించారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన గాంధీ జ్ఞాన్ ప్రతిష్ట గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ 50వ స్వర్ణోత్సవాల్లో భాగంగా అశోక్‌ను మహాత్మా చరఖా అవార్డుతో సంస్థ వ్యవస్థాపకులు గున్న రాజేందర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఆలోచనలను ప్రపంచ శాంతి వైపు మరలించే ప్రయత్నం చేస్తుండటంతో పాటు ప్రకృతి వ్యవసాయం, ఖద్దరు బట్టల వినియోగం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

ఫ్రీ జర్నీ సరే.. బస్సుల పెంపేదీ?

(5వ పేజీ తరువాయి)

కంటే అక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణించే సంఖ్య ఎక్కువగా ఉంటుంది. తొర్రూరు నుంచి హైదరాబాద్, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడిపిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం రాక ముందు తొర్రూరు డిపో బస్సుల ద్వారా ప్రతిరోజు 20వేల మంది ప్రయాణికులు ప్రయాణించగా, డిపోకు రూ.18లక్షల మేర ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఫ్రీ బస్సు పథకం అమలుతో ప్రతిరోజు 34వేల మంది ప్రయాణించడం ద్వారా రూ.24లక్షల ఆదాయం వస్తోంది. సదరు డిపోకు ఇటీవల రెండు ఏసీ బస్సులు, 8 పల్లెవెలుగు మొత్తంగా 10 బస్సులు వచ్చాయి. వాటిని వివిధ రూట్లలో నడుపుతున్నారు.

ఆర్టీసీ బస్సులను పెంచితేనే..

జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు డిపో బస్సుల ద్వారా నిత్యం సుమారు 70వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అయితే ఆయా డిపోల నుంచి ప్రధాన రూట్లలో ఎక్కువగా బస్సులు నడుస్తున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో వారు ఇప్పటికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం వారికి దక్కడం లేదు. మరోపక్క రోజు రోజుకు ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్సుల్లో సీట్ల పరిమితికి మించి కిక్కిరిసిన ప్రయాణం చేస్తూ ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. టీజీ ఆర్టీసీ మరిన్ని బస్సులను పెంచి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని, అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి అందరికీ ఉచిత బస్సు పథకం వర్తించేలా చూడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి



రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి. సర్కార్ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సరిపడా బస్సులులేక ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంత మహిళలకు ఉచిత బస్సు పథకం అందడం లేదు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులను తొలగించాలి.

– హలావత్ లింగన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి